# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 19 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ గురువారం 24 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :19 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA THU 24 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో

## కొట్లాట..

### పోలీస్ స్టేషన్‌కు చేరిన సుమలత వర్సెస్ రఘు మాస్టర్ పంచాయితీ!

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో అం తర్గత వర్గ విభేదాలు ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీస్ ప్రాంగణంలోనే ఇరు వర్గాల డ్యాన్సర్లు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త

- మిగతా 2లో

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

### ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు



- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

- మిగతా 2లో



## బీజేపీలో భారీ మార్పులు..

### 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్విండ్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

- మిగతా 2లో

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి
- జాబితాలో పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ఏఐ, టెక్ రంగాల నుంచి కొత్త కుబేరుల వెల్లువ



పెన్ పవర్ డెస్క్:భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది.ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

### ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నేడు చక్రస్నానం
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు

- మిగతా 2లో

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన
- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో

### సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత

# యువతరానిదే

- అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తీర్చిదిద్దుతాం
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు 12 ఎకరాలు కేటాయింపు
- రూ.60 వేల కోట్లతో రాజధానిలో రోడ్ల నిర్మాణం
- అమరావతిలో హెల్త్‌కేర్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు
- ఏఐ, డేటా సెంటర్లు, డీప్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుండాలి



పెన్ పవర్ డెస్క్: ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధానిలో నిర్మించే ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కి 12 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు."అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి.. వస్తున్నాయి. రూ.60వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. రాజధానికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్స్ అవుతాయి. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది.. అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా

- మిగతా 2లో

## రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్

- మిగతా 2లో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

### ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు
- వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు
- 2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు
- చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

- మిగతా 2లో

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే

- మిగతా 2లో




## న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన ఆదిత్య-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది. స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్ అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ. గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఆదిత్య-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది. ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది. ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛిత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛిత్తి మరో విచ్ఛిత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

# ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు .డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

**కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది. కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం**

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు. చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం.

**ఇతర ముఖ్యమైన నిర్ణయాలు**

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైతు, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి

దర్యాప్తు చేపట్టారు. 2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది.

2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు

ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

- మొదటి పేజి తరువాయి

పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ 'మినిట్స్ బుక్' దక్కించుకునే క్రమంలో ప్రస్తుత అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత, కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ గొడవ ముదిరి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. అసోసియేషన్ కు సంబంధం లేని వ్యక్తులు కుట్రతో తమపై దాడి చేశారని సుమలత ఆరోపించింది. సుమలత మనుషులే తమపై దాడి చేశారంటూ రఘు మాస్టర్ వర్గం పేర్కొంది. ఈ ఘటనపై ఇరువర్గాలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమలత తీరుపై ఆగ్రహంతో ఉన్న కొందరు తోటి డ్యాన్సర్లు ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ గొడవకు కారణం.. అంతకుముందు తెలుగు ఫిలిం ఫెడరేషన్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.. డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలను తేల్చేందుకు ఫెడరేషన్ పెద్దలు సుమలత, రఘు మాస్టర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 225 మంది సినీ డ్యాన్సర్లు హాజరైన ఈ మీటింగ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయ సేకరణ జరిపారు.

ఈ ఓటింగ్‌లో ఏకంగా 214 మంది డ్యాన్సర్లు రఘు మాస్టర్‌కే మద్దతు తెలపగా.. సుమలత వైపు కేవలం 11 మంది మాత్రమే నిలిచారు.

దీంతో మెజారిటీ నిర్ణయం మేరకు సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 11న అసోసియేషన్ నూతన ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసింది.

ఫెడరేషన్ తీసుకున్న ఈ ఊహించని షాకింగ్ నిర్ణయం, ఎన్నికల షెడ్యూల్‌తో డ్యాన్సర్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏకంగా ఫిల్మ్ ఛాంబర్‌లోనే దాడికి పాల్పడేంతగా వివాదం చెలరేగడంతో అక్టోబర్ 11న జరగబోయే ఎన్నికలు ఇంకెన్ని మలుపులు తిరుగుతాయోనని ఇండస్ట్రీ వర్గాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.

# బీజేపీలో భారీ మార్పులు..

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ

ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే

- మొదటి పేజి తరువాయి

సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లు తయారు చేస్తున్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

# అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మొదటి పేజి తరువాయి

అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

## తుఫాను ప్రభావంతో గణేష్ నిమజ్జనాలు త్వరగా ముగించాలి

**రానున్న రెండు రోజులు చీకటి పడేలోపే పూర్తి చేసుకోవాలి: ఎస్పీ బిందు మాధవ్**



**పెన్ పవర్ ప్రతినిధి కాకినాడ, సెప్టెంబర్ 23:** తుఫాను ప్రభావం ఉధృతంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రానున్న రెండు రోజుల పాటు గణేష్ నిమజ్జన కార్యక్రమాలను సాయంత్రం చీకటి పడేలోపే పూర్తి చేసుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ సూచించారు. జిల్లాలోని గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిమజ్జన కార్యక్రమాలను త్వరగా ముగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు నిర్వాహకులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్పీ సూచించారు. తుఫాను పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**పాఠశాల భవనాలు తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను అనుమతించాలి**



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** భారీ వర్షాలు, తుపాను వాతావరణం నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు,ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రజారోగ్యం, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు,మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులు, వర్షపాతం, రిజర్వాయర్ల నీటిమట్టాలు, సహాయక చర్యల సన్నద్ధతపై సమీక్షించారు.జిల్లాలో సెప్టెంబర్ 22 సాయంత్రం నాటికి సగటున 84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అదనంగా 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టర్ తెలిపారు. వర్షాలు 24వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.పాఠశాల భవనాలు, సీలింగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి భవనం సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే విద్యార్థులను తరగతి గదుల్లోకి అనుమతించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భవనాలు సురక్షితంగా లేకుంటే ప్రత్యామ్నాయ గదుల్లో తరగతులు నిర్వహించాలని ఎంఈఓలను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఏలేరు రిజర్వాయర్‌కు ప్రస్తుతం 145 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 13 టీఎంసీల ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉన్నందున ఏలేరు వద్ద ప్రస్తుతం ముప్పు లేదని చెప్పారు. పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం 92 అడుగులకు చేరిందని, 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. నీటిమట్టం 99 అడుగులకు చేరితే దిగువకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని, ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సుబ్బారెడ్డి సాగర్‌లో ప్రస్తుతం ఇన్‌ఫ్లో పెరగలేదని, అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు.రాబోయే పది రోజుల్లో ప్రసవ తేదీ ఉన్న 30 మంది గర్భిణులను వైద్య ఆరోగ్య శాఖ గుర్తించిందని, వారిని ముందస్తుగా సురక్షితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రత్తిపాడు, రౌతులపూడి తదితర కొండ ప్రాంత హ్యాబిటేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో విద్యుత్ స్తంభాలు పడిపోయిన ఘటనలు ఇప్పటివరకు నమోదు కాలేదని, సబ్‌స్టేషన్లలో స్పేర్ పోల్స్, కండక్టర్లు, కేబుల్స్, సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. రహదారులపై చెట్లు కూలితే వెంటనే తొలగించేందుకు జేసీబీలు, ట్రీ కట్టర్లు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా గ్రామ పంచాయతీల్లో జనరేటర్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.శంఖవరం మండలంలో లోతట్టు ప్రాంతాలు, కాజ్‌వేల వద్ద ప్రస్తుతం ముంపు సమస్య లేదని అధికారులు తెలిపారు. తాళ్లరేవు తీర ప్రాంతం కావడంతో మత్స్యకారులు, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసినట్లు చెప్పారు. అల్పపీడనం తీరం దాటే సమయంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎవరూ అలసత్వం వహించవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతిరోజూ ఉదయం,సాయంత్రం లైన్ డిపార్ట్‌మెంట్లు,మండలాల నుంచి మానవ నష్టం,పశునష్టం,విద్యుత్ అంతరాయాలు తదితర వివరాలతో సమగ్ర నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

## డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు? రౌడీషీట్లా?

**మాజీ ఎంపి చింతా అనురాధ**



**అల్లవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 23:** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు,అవకతవకలపై న్యాయమైన విచారణ జరిపించాలని ప్రశ్నించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయడం, తాజాగా 51 మందిపై రౌడీషీట్లు తెరవాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ అన్నారు.డీఎస్సీ నియామకాల్లో పారదర్శకతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో వాటికి సమాధానాలు చెప్పాల్సిన కూటమి ప్రభుత్వం, ఆ అంశాన్ని ప్రశ్నిస్తున్న వారిపై పోలీసు కేసులు, రౌడీషీట్లతో భయపెట్టే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె అన్నారు.విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ అంశంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన అనంతరం కేసులు నమోదు చేయడం, పలువురిపై కఠిన చర్యలకు ఉపక్రమించడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని అనురాధ పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కులని, ఆ హక్కులను కాలరాయకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరించాలని అనురాధ అన్నారు.కూటమి ప్రభుత్వం పోలీసు చర్యలతో ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతులను అణచివేయడం కాకుండా, డీఎస్సీ నియామకాలపై ఉన్న అనుమానాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని చింతా అనురాధ డిమాండ్ చేశారు.ద

## పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీల సేవలు అభినందనీయం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ




**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 23:** పదవి ముగిసినంత మాత్రాన ప్రజా సేవకు ముగింపు కాదని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రజల ప్రజా సమస్యలపై స్పందించే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంటుందని ఐదేళ్ల పదవీకాలంలో తమ తమ గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన ప్రతి ప్రజాప్రతినిధి సేవలను అభినందనీయమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ అభినందన సభ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పదవీ విరమణ చేయబోతున్న ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ, ఎంపీపీ లకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఐదేళ్ల పదవీకాలంలో తమ తమ గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన ప్రతి ప్రజాప్రతినిధి సేవలను ఆయన అభినందించారు.అదేవిధంగా ఈ అభినందన సభను ఏర్పాటు చేసిన మండల ప్రజా పరిషత్ అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రజాప్రతినిధిగా ఎన్నికైన రోజు నుంచే పదవీ విరమణ చేసే రోజు కూడా నిర్ణయించబడుతుందని, అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో చేరిన రోజునే వారి పదవీ విరమణ తేదీ కూడా నిర్ణయించబడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.ఎంపీటీసీ సభ్యులు తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి కోసం చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. పదవి ముగిసినంత మాత్రాన ప్రజా సేవకు ముగింపు కాదని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రజల గొంతుకగా నిలిచే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.అనంతరం పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం అనంతరం మండల పరిషత్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి. -విస్తృతస్థాయి పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,23:** నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. ప్రత్తిపాడులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులతో విస్తృతంగా చర్చించారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని,అందరూ ఐక్యతతో సమిష్టిగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సత్యప్రభ సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్, సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, ఏలేశ్వరం మండల, టౌన్, రౌతులపూడి మండల టిడిపి అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,మూది నారాయణస్వామి, తమరాల సత్యనారాయణ, నాయకులు పసల సూరిబాబు, బొదిరెడ్డి గోపి, ఉత్తరకంచి మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ, దనేకుల భద్రం, అడ్డాల త్రిమూర్తులు,యర్రాబత్తుల గోవిందనాయుడు, బద్రి రామారావు, సూతి ప్రభాకర్, బుద్ధ సూర్యప్రకాష్, గాబు కృష్ణమూర్తి, వెలుగుల నాని, కొప్పన నాని, రామిశెట్టి మునిసిబు, రుచి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల నమ్మకమే నా ఐదేళ్ల పదవీకాలానికి అసలైన బలం

**ఒమ్మి బిందుమాధవి రఘురామ్**

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** జగ్గంపేట జడ్పీటీసీగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందించిన ఒమ్మి బిందుమాధవి రఘురామ్ దంపతులను బుధవారం తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ సాధారణ ఆత్మీయ సమావేశంలో ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జిల్లా పరిషత్ సీఈఓ చేతుల మీదుగా ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఒమ్మి బిందుమాధవి రఘురామ్ మాట్లాడుతూ ప్రజలు నాపై నమ్మకం పెట్టుకుని జడ్పీటీసీగా గెలిపించిన రోజు నుంచి, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యంగా పనిచేశాను. ఐదేళ్ల పదవీకాలంలో ప్రజలకు ఎలా ఉపయోగపడాలి? వారి సమస్యలను ఎలా పరిష్కరించాలి? అనే ఆలోచన తప్ప నాకు మరో ఎజెండా లేదు” అని అన్నారు. జగ్గంపేట మండలంలోని ప్రజా అవసరాలు, సమస్యలను జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ, జగ్గంపేట మండల పరిషత్ సమావేశాల్లోనూ పదేపదే ప్రస్తావించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అనేక సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. సన్మానం అందుకున్న రఘురామ్ దంపతులను పలువురు అభినందించారు.



## వీఆర్ఏల తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ అర్ధనగ్న జల దీక్ష.




**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23:**మండల కేంద్రమైన ఆలమూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట గల ధర్నా చౌక్ లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 8వ రోజుకు చేరింది. మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్ ఆధ్వర్యంలో జోరువానలో స్థానికంగా గల పెద్ద కాలువలో అర్ధనగ్న జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని వారు జల దీక్షలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలమూరు మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సెక్రటరీ కె శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, మండల వీఆర్ఏలు దీక్షలో పాల్గొని నినాదాలు చేశారు.

## 50వ జాబ్ మేళాలో 24 మందికి ఉద్యోగాలు



**రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 23**: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వారపు జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రామచంద్రపురం ఉపాధి భవన్‌లో నిర్వహించిన 50వ జాబ్ మేళాలో 24 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఫ్లిప్‌కార్ట్‌కు 9 మంది, టాటా విస్ట్రాన్‌కు 3 మంది, నెట్ ఆన్ కంపెనీకి 6 మంది, టాటా ఎలక్ట్రానిక్స్‌కు 7 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు శాస్త్రి, కిరణ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు వివిధ కంపెనీలను ఆహ్వానించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, ఉపాధి అధినేత రామ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## తప్పులు లేని ఓటరు జాబితాకు రాజకీయ పార్టీల సహకారం అవసరం



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** తప్పులు లేని,పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించి జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరించారు. డీఆర్వో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, ఏఈఆర్ఓలు రోజుకు గరిష్టంగా 100 నోటీసులను మాత్రమే పరిశీలించేలా సూచించామని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,822 పోలింగ్ కేంద్రాల్లో 14,55,209 మంది ఓటర్లు నమోదై ఉన్నారని చెప్పారు. వివిధ కారణాల వల్ల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 1,95,602 ఓట్లను తొలగించగా,31,695 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, క్లెయిమ్‌లు,అభ్యంతరాలను అక్టోబర్ 5లోపు పరిష్కరిస్తామని, అక్టోబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని డీఆర్వో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఫారం-7, పోలింగ్ కేంద్రం మార్పునకు ఫారం-8 ద్వారా అందే దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న అర్హులైన ఓటర్లు గుర్తింపు పత్రాలతో సంబంధిత అధికారుల ముందు హాజరై తమ అర్హతను ధ్రువీకరించుకోవచ్చని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై చర్యలు:తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధించిన ఎన్నికల సంఘం మార్గదర్శకాలు,షెడ్యూల్‌ను డీఆర్వో రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సెప్టెంబర్ 28న నోటీసు జారీ చేస్తామని,నవంబర్ 6 వరకు ఫారం-19 దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించి,డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. డిసెంబర్ 25 నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు నిబంధనల మేరకు తమ దరఖాస్తులను సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో కోరారు. సమావేశంలో ఆప్ ప్రతినిధి కె. కృష్ణమోహన్, బీఎస్పీ ప్రతినిధి ఎస్. అప్పారావు, బీజేపీ ప్రతినిధి సీహెచ్. రమేష్,సీపీఎం ప్రతినిధి పి.వీరబాబు, కాంగ్రెస్ ప్రతినిధి పి.శ్రీనివాసు,టీడీపీ ప్రతినిధి జి.సాయిబాబా, జనసేన ప్రతినిధి ఎ.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి ఆర్. వెంకటేశ్వరరావు,ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.జగన్నాధం,డీటీ తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచనలకు ఆవిష్కరణల వేదిక.. ఐడియా స్పార్క్ 2.0




**గండేపల్లి, పెన్ పవర్ సూరంపాలెం:** ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఐడియా స్పార్క్ 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బాహ్య స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సృజనాత్మక ఆలోచనలు, నమూనా ఉత్పత్తులు, ప్రాజెక్టులు, సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. కార్యక్రమాన్ని డిప్యూటీ ప్రో ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డా. రమేష్ అధిరెడ్డి, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డీన్ డా. జి. సంజీవ్ రావు, ఫ్యాకల్టీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.

ఐడియా స్పార్క్ 2.0 రెండో ఎడిషన్‌లో 40కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో బాహ్య స్టార్టప్‌లు, పూర్వ విద్యార్థుల స్టార్టప్‌లు, విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించిన పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఆయా ప్రదర్శనలు సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతను ప్రతిబింబించగా, ఫ్యాకల్టీ సభ్యులు, పరిశ్రమ ప్రతినిధులు, సందర్శకులు వాటిని పరిశీలించారు.

గత ఎడిషన్‌లో విజయం సాధించిన స్టార్టప్‌లు తమ ప్రగతిని కూడా ప్రదర్శించాయి. విద్యార్థులు, యువ వ్యవస్థాపకులు తమ నూతన ఆలోచనలను ప్రదర్శించడంతో పాటు వాటిని ఆచరణాత్మక ఉత్పత్తులు, సేవలుగా అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పించింది. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ స్టార్టప్‌లకు పునాది వేయవచ్చన్నారు. ఐడియా స్పార్క్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో వ్యవస్థాపకతను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 'హైవో' ఏఐ ఆధారిత సామాజిక మాధ్యమ స్టార్టప్‌ను అధికారికంగా ప్రారంభించారు.

## ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. ముందస్తు జాగ్రత్తలు అవసరం ఏ.ఎంజీ, దేశముని రెడ్డి





**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్, 23:**మండల పరిధి తాళ్లూరు, జెడ్. రాగంపేట ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కాకినాడ జిల్లా ఉద్యానశాఖ సంయుక్త సంచాలకులు, ఎల్‌నినో ప్రత్యేక అధికారి డా. ఎం.జి. దేవముని రెడ్డి సూచించారు. తల్లూరు, జెడ్. రాగంపేట గ్రామాల్లో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్ల ఏర్పాటు, అంతర పంటల సాగు, పశుగ్రాసం పెంపకంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యాన పంటలకు నీటి కొరత రాకుండా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు పంటలకు అవసరమైన పోషకాలు, సస్యరక్షణ చర్యలను సకాలంలో చేపట్టాలని తెలిపారు.

ఆయిల్‌పామ్ వంటి శాశ్వత పంటల్లో అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని అధికారులు వివరించారు. పీఎండీఎస్ ద్వారా 5 కిలోల కిట్ రూ.460కు, హెక్టారుకు రూ.5,250 వరకు సహాయం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వీవీజీ రామ్ జీ––పెరెనియల్ ఫోడర్ పథకం కింద ఎకరానికి రూ.69,720 చొప్పున రెండేళ్లపాటు సహాయం అందించనున్నట్లు వివరించారు. వార్షిక పశుగ్రాస విత్తనాలపై 75 శాతం, పశువుల దాణాపై 50 శాతం సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు. కమ్యూనిటీ పెరెనియల్ ఫోడర్ కార్యక్రమం కింద 50 సెంట్ల నుంచి 10 ఎకరాల వరకు పశుగ్రాసం సాగు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

కార్యక్రమంలో ఏడీజీహెచ్ డా. దేవముని రెడ్డి, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన అధికారి వల్లీ, వ్యవసాయ అధికారి లక్ష్మి, వీఏహెచ్ఏలు, వీఏఏలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్ శీలమంతుల వీరబాబు, వైస్ సర్పంచ్ పిన్నీ వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు కొండ్రు అప్పలరాజు, టీటీడీ జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ డే పోస్టర్ ఆవిష్కరణ




**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సమాజ సేవ పట్ల విద్యార్థుల్లో మరింత అవగాహన కల్పించేలా ఎన్ఎస్ఎస్ డే వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని ప్రోగ్రామ్ అధికారులు తేజేశ్వరరావు, అశ్విని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన జడ్పీ పాలన.. నిధుల కొరతపై జడ్పీటీసీల ఆవేదన







**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఐదేళ్ల పాలనకు బుధవారం తెరపడింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన చివరి సాధారణ ఆత్మీయ, అభినందన సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పాలనలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరత కారణంగా అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండిపోయాయని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వాటిని బలోపేతం చేశారని పేర్కొన్నారు. దీంతో చివరి జడ్పీ సమావేశం ప్రధానంగా వైఎస్సార్‌సీపీ సభ్యుల అభిప్రాయాల వ్యక్తీకరణకు వేదికగా మారింది.

2021--26 స్థానిక సంస్థల ఎన్నికల్లో పి.గన్నవరం నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విప్పర్తి వేణుగోపాలరావు అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ పాలనను కొనసాగిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేశారని జడ్పీటీసీలు ఆయనను అభినందించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు నిధులను సమానంగా కేటాయిస్తూ రాజకీయాలకు అతీతంగా పాలన సాగించారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసి ప్రజా సేవలో రాణించాలని జడ్పీటీసీలకు సూచించారు. సభ్యులు ప్రస్తావించిన పెండింగ్ పనులను పరిశీలించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్మశాన వాటికలకు మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు దంపతులను ఘనంగా సత్కరించారు. సమావేశానికి హాజరైన జడ్పీటీసీలకు గ్రూప్ ఫొటోలను అందజేసి, వారి కుటుంబ సభ్యులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ బాబు, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, జడ్పీ ఉపాధ్యక్షులు బుర్ర అనుబాబు,మేరుగు పద్మలత, స్టాండింగ్ కమిటీ చైర్మన్ రొంగల పద్మావతి, సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి. శ్రీలలిత, జడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**నా పేరు మార్పు**

డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం,వెలిచేరు గ్రామం, డోర్ నెం.3-8, ఎస్సీ పేట కాపరస్తు రాలు అయిన నేను యల్లమెల్లి దుర్గ, తండ్రి: వెర్రెయ్య అను పేరును బైపే కనకదుర్గ, భర్త: నాగేంద్రబాబు (ఆధార్.3133 1828 9956) అనుగా మార్పు చేసుకొన్నానని తెలియ పరుస్తున్నాను.

బైపే కనకదుర్గ, భర్త: నాగేంద్రబాబు
సెల్: 8790737085

# ర్యాలికి అభివృద్ధి జలధార.. రూ.3.20 కోట్ల పనులకు శ్రీకారం





- గ్రామీణ మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం.. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో కొత్త ఊపిరి
- ప్రజావసరాలకు అనుగుణంగా ప్రణాళికలు.. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 23:**గ్రామీణ ప్రగతికి మౌలిక వసతులే చోదకశక్తిగా భావిస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో బుధవారం సుమారు రూ.3.20 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో గ్రామాభివృద్ధికి మరింత ఊతం లభించింది.గ్రామీణ రహదారుల అభివృద్ధిలో భాగంగా సాస్కి నిధులు రూ.1.25 కోట్లతో చేపట్టనున్న రెండు కీలక రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ర్యాలి బ్రిడ్జి నుంచి బుల్లెయ్య రేవు వరకు రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న రహదారికి భూమిపూజ నిర్వహించారు. అదేవిధంగా ర్యాలి ఆర్అండ్బీ రోడ్డు నుంచి మాధవరావుపేట మీదుగా తిరిగి ఆర్అండ్బీ రోడ్డు వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న మరో రహదారి పనులకు శ్రీకారం చుట్టారు.

### తాగునీటి మౌలిక వసతులకు ప్రాధాన్యం

ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలజీవన్ మిషన్ నిధులు రూ.45.50 లక్షలతో నిర్మించనున్న మైక్రో ఫిల్టర్ సంపు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. సురక్షిత తాగునీటి సరఫరాను మరింత పటిష్టం చేయడంలో ఈ నిర్మాణం దోహదపడుతుందని తెలిపారు.

### ఉపాధి హామీ నిధులతో రహదారుల ప్రారంభం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.50 కోట్లతో ఇప్పటికే నిర్మించిన పలు రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ప్రజల దైనందిన ప్రయాణాలకు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఈ రహదారులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ పల్లెల సమగ్రాభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.ర్యాలి గ్రామంలో ఒకేసారి వివిధ శాఖల నిధులతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు నిర్ణీత ప్రమాణాలతో, నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తయితే గ్రామీణ ప్రజలకు మౌలిక వసతుల పరంగా మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, గుడెల్ల నాగేంద్ర గౌడ , ముళ్ళపూడి భాస్కరరావు,, కాయల జగన్నాధ రావుగ్రామ అధ్యక్షులు పెండెం వెంకన్న, మాజీ సర్పంచ్ పేర్చెర్ల పుల్లంరాజు వర్మ,, మద్దూరి సుబ్బారావు,కూటమి నాయకులుమండల నాయకులు గ్రామ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- పలు మౌలిక వసతులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 23:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం దేవస్థాన ప్రాంగణంలో పూర్తిచేసిన పలు మౌలిక వసతులను ప్రారంభించారు.అర్చకుల క్వార్టర్స్ సమీపంలోని టాయిలెట్ బ్లాక్ వెనుక భాగంలో రూ.4.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, కేశఖండనశాల ముందు భాగంలో రూ.4.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా నూతన కార్ పార్కింగ్ ప్రాంగణంలో భక్తులు, వ్యాపారులకు ఉపయోగపడే విధంగా షాపుల కోసం నిర్మించిన జీఐ షెడ్లను కూడా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా దేవస్థానంలో మౌలిక వసతులను క్రమంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్ తదితర సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో దేవస్థాన ఉపకమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు యల్లమిల్లి చంద్రకుమారి జగన్మోహన్, ఎం.ఆర్.ఓ రామచంద్రమూర్తి, కాయల జగన్నాధం, ఏపుగంటి సుబ్బారావు, పెండెం వెంకన్న, ఎరుబండి రాజు, ఏపుగంటి వెంకటేష్, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు

## ర్యాలి జగన్మోహిని కేశవస్వామి సన్నిధిలో వైభవంగా మాస కళ్యాణం





- శ్రవణా నక్షత్ర విశిష్టతతో కన్నులపండువగా కల్యాణోత్సవం
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఆలయ ఈవో సురేష్‌బాబు

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 23:**కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో కొలువుదీరిన అత్యంత పురాతన, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాలస్వామి వారి దేవస్థానంలో శ్రవణా నక్షత్ర మాస కళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తిరసభరితంగా మారింది.ఉషోదయ వేళ స్వామివారికి మేలుకొలుపు సేవ, అలంకరణోత్సవం, సుప్రభాత సేవలను ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు సంప్రదాయబద్ధంగా, ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి, మాస కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా కొనసాగించారు.

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఈవో మాస కళ్యాణోత్సవ పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దివ్య కల్యాణ ఘట్టాలను భక్తులు కనులారా తిలకించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ వేద పండితులు వెంకటావధాని వేద ఆశీర్వచనం అందించారు. వేదఘోష, మంగళవాయిద్యాల మధ్య సాగిన కల్యాణోత్సవం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.

### అక్టోబర్ 20న తదుపరి మాస కళ్యాణం

తదుపరి మాస కళ్యాణ మహోత్సవం అక్టోబర్ 20, 2026న నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వివాహం, సంతానం, విద్య, ఉద్యోగం, బదిలీ, పదోన్నతి, విదేశీయానం, ఆరోగ్యం, వ్యాపారం తదితర కోరికల సాధన కోసం భక్తులు స్వామివారి మాస కళ్యాణంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.మాస కళ్యాణంలో పాల్గొనదలచిన భక్తులు 091 99113 34733 నంబరును సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా రూ.750 రుసుము చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. పూజకు సంబంధించిన ప్రసాదాన్ని భక్తులకు పోస్టు ద్వారా పంపించే ఏర్పాట్లు ఉన్నాయని ఆయన వెల్లడించారు.

## ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందించాలి





**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** కాకినాడ జిల్లాలో జల జీవన్ మిషన్, అమరజీవి జలధార ప్రాజెక్టుల పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేసి ప్రతి ఆవాసంలో ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అధికారుల కన్వర్జెన్సీ సమీక్షా సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జల జీవన్ మిషన్, అమరజీవి జలధార,స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.సింగిల్ విలేజ్ స్కీములు, రెట్రోఫిట్టింగ్ పనులు,ఓహెచ్ఎస్ఆర్‌ల ప్రక్షాళన, శుభ్రత పనులను వేగవంతం చేయాలని సూచించారు.గృహ పంచాయతీ నంబర్లు,ఆస్తిపన్ను రసీదుల ఆధారంగా కుళాయి కనెక్షన్లు లేని నివాసాలను గుర్తించి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించాలని స్పష్టం చేశారు.వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమ్మర్ స్టోరేజ్ చెరువులను కాలువలు, గ్రావిటీ లేదా పంపుల ద్వారా ముందుగానే నింపేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు నిరుపేద గిరిజన ఆవాసాల్లో సురక్షిత నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద అవసరమైన ప్రాంతాల్లో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, నిరంతర పారిశుద్ధ్య చర్యలు, ప్రజల్లో అవగాహన ద్వారా గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.పురోగతిలో ఉన్న, పెండింగ్‌లో ఉన్న పనులకు నిర్దిష్ట గడువులు విధించి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. పనుల అమలులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మహమ్మద్ అబ్దుల్ మతీన్, జిల్లా పంచాయతీ అధికారి పి. రవికుమార్, డ్వామా పథక సంచాలకులు ఎస్.మధుసూదన్, జలవనరుల శాఖ ఈఈ శేషగిరిరావు, వివిధ శాఖల ఇంజనీర్లు,అధికారులు పాల్గొన్నారు.

## డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ

పరిశ్రమ అవకాశాలపై అవగాహన కల్పించిన మూడు రోజుల శిక్షణ శిబిరం




**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), సూరంపాలెంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన స్పైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహించిన మూడు రోజుల డ్రోన్ సాంకేతికత శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది.

సెప్టెంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన ఈ శిక్షణలో విద్యార్థులకు డ్రోన్ సాంకేతికత, మానవరహిత వైమానిక వాహన వ్యవస్థలు, డ్రోన్ నిర్మాణం, సెన్సార్లు, ఎంబెడెడ్ వ్యవస్థలు, విమాన నియంత్రణ, వైర్‌లెస్ సమాచార వ్యవస్థలు, నియంత్రణ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు, చిత్ర విశ్లేషణ తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు.శిక్షణలో భాగంగా విద్యార్థులకు డ్రోన్ల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. డ్రోన్ సాంకేతికతను వివిధ రంగాల్లో ఎలా వినియోగిస్తున్నారో, పరిశ్రమల్లో దాని ప్రాధాన్యత ఏమిటో వివరించారు. తరగతి గదిలో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమ అవసరాలకు అనుసంధానం చేసుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు, ప్రిన్సిపాల్ జి. నరేష్, డైరెక్టర్లు ఎం.వి. హరనాథబాబు, కె. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం. సతీష్ విద్యార్థులను అభినందించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాలు వారి భవిష్యత్ ఉపాధి, కెరీర్ అవకాశాలకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈసీఈ విభాగాధిపతి డా. వి. ప్రశాంత్ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, ప్రాజెక్టుల అభివృద్ధి సామర్థ్యం, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడమే శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

## సీఎం సహాయనిధితో పేద కుటుంబానికి ఆర్థిక భరోసా



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. బుధవారం జగన్నాధపురంలోని తన స్వగృహంలో 18వ డివిజన్‌కు చెందిన గాదం మధుసూదన్‌రావు కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.5,03,071 చెక్కును అందజేశారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యే కొండబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి బొడ్డు శివాజీ, మేరేటి బ్రహ్మాస్వామి, పినపోతు శివ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ సమయంలో రైతులు పలు జాగ్రత్తలు పాటించాలి.

**-పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఏఓ, నాగం సుధామాధురి.**

**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్, 23:** తుఫాను సమయంలో రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కిర్లంపూడిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారిణి నాగం సుధా మాధురి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం వరి పంట పిలకలు తొడిగే దశలో ఉందని,తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో పంట నీట మునిగే పరిస్థితి ఏర్పడితే రైతులు వెంటనే వర్షపు నీరు బయటకు వెళ్లేలా మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అవసరమైతే మోటార్లను ఉపయోగించి పొలాల్లోని నీటిని బయటకు తోడి పంటను రక్షించుకోవాలని తెలిపారు.తుఫాన్ ప్రభావం తగ్గిన అనంతరం వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 400 మి.లీ. మందులను ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ, ఎన్ సీతారామమూర్తి,మణికంఠ,పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 25న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం





## 4.71 లక్షల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు

**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23**: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రెండో విడత కార్యక్రమాన్ని సెప్టెంబర్ 25న జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కార్యక్రమ నిర్వహణపై జిల్లా అధికారులతో సన్నద్ధత సమావేశం నిర్వహించి శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల సుమారు 4.71 లక్షల మంది పిల్లలు, కిశోర బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 25న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు జూనియర్ కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్, నర్సింగ్, డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో అర్హులైన విద్యార్థులకు మాత్రలు అందించాలని తెలిపారు. ఆ రోజు మాత్రలు తీసుకోలేని వారికి అక్టోబర్ 5న మాప్‌అప్ కార్యక్రమం ద్వారా అందించాలని ఆదేశించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, దివ్యాంగులు, భవిత కేంద్రాల్లోని పిల్లలకు సమీప అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందించాలని కలెక్టర్ సూచించారు. 1--2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2--19 సంవత్సరాల వారికి ఒక మాత్ర ఇవ్వాలని, 1--5 సంవత్సరాల చిన్నారులకు మాత్రను నీటిలో కలిపి ఇవ్వాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పర్యవేక్షణలోనే మాత్రలు వేయించాలని స్పష్టం చేశారు.నులిపురుగుల నివారణతో పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో గోడపత్రికలు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అల్బెండజోల్ వినియోగంపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అరుదుగా ఎదురయ్యే ప్రతికూల ప్రభావాలకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.జాతీయ బాల ఆరోగ్య కార్యక్రమం ద్వారా పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వయస్సు వరకు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, అభివృద్ధిలో ఆలస్యం, వైకల్యాలు, దృష్టి, వినికిడి, దంత సమస్యలు, రక్తహీనత, చర్మవ్యాధులను సమగ్రంగా స్క్రీనింగ్ చేసి గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గుర్తించిన వారికి అవసరమైన చికిత్స, రిఫరల్, ఫాలోఅప్ సేవలు అందించాలని ఆదేశించారు.తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు పోషకాహార పునరావాస కేంద్రాల ద్వారా అవసరమైన వైద్య చికిత్స, పోషకాహార పునరావాసం అందించాలని తెలిపారు. తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, శిక్షణ కల్పించాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డీఈఓ పి. రమేష్, ఐసీడీఎస్ పీడీ సి.హెచ్. లక్ష్మి, డీఎల్ఏటీఓ డాక్టర్ ఎస్. చలమయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కె.వి. సుబ్బరాజు, ఎన్‌సీడీ--ఆర్‌బీఎస్‌కే డీసీ డాక్టర్ వి. అరుణ, డీఎంఓ డాక్టర్ ప్రభాకర్, ఇన్‌చార్జ్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంతి, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో తొలిరోజు 7 వేల గణేశ విగ్రహాల నిమజ్జనం







**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** జిల్లావ్యాప్తంగా బుధవారం తొలిరోజు సుమారు 7 వేల గణేశ విగ్రహాల నిమజ్జన యాత్రలు ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ నగరంలో 600, రూరల్ బీచ్‌లో 800, అన్నవరం పంపాలో 400, తుని తాండవ నదిలో 330, పిఠాపురం--కొత్తపల్లి--ఉప్పాడ తీరంలో 800, సామర్లకోట కెనాల్‌లో 680, చీడిగ రేవులో 90, చొల్లంగి రేవులో 105, ఇతర కాలువ ప్రాంతాల్లో సుమారు 1,300 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.నిమజ్జనాల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా, వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించాయి. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, గజ ఈతగాళు ,, అంబులెన్స్‌లు, భారీ లైట్లు, డ్రోన్ కెమెరాలను అందుబాటులో ఉంచారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చిన నిర్వాహకులకు అభినందన పత్రాలు అందజేశారు.నగర గణేశ ఉత్సవ సమితి అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు రంభాల వెంకటేశ్వరరావు తదితరులు వినాయక సాగర్, వన్‌టౌన్ జెట్టీ, చాంబర్ ఆఫ్ కామర్స్ జెట్టీ, రూరల్ బీచ్, చీడిగ, చొల్లంగి రేవుల్లో నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ముంపు నివారణకు కాకినాడ నగర యంత్రాంగం అప్రమత్తం



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తకుండా కాకినాడ నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ ఎన్.వి. సత్యనారాయణ బుధవారం నగరంలోని ప్రధాన డ్రైనేజీలను పరిశీలించి, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.ఆర్టీవో కార్యాలయం, ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డు, దుమ్ములపేట రైల్వే ట్రాక్ సమీపంలోని డ్రైనేజీలను పరిశీలించిన కమిషనర్.. దుమ్ములపేటలో చెత్తాచెదారం తొలగింపును దగ్గరుండి పర్యవేక్షించారు. ఎన్ఎఫ్‌సీఎల్, దుమ్ములపేట, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం,దూది మిల్లు ప్రాంతాల్లోని డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వర్షపు,మురుగునీరు సజావుగా ప్రవహించేలా హెల్త్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్య క్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆమోదం పొందిన 27 ప్రాజెక్టులపై త్వరితగతిన నివేదికలు



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో కాకినాడ జిల్లా నుంచి ప్రతిపాదించిన 54 ప్రాజెక్టుల్లో 27 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వాటికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు, ఫిజిబిలిటీ నివేదికలను త్వరితగతిన ఈ-ఆఫీస్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. తునిలో నర్సింగ్ కళాశాల, ఏరియా ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, జగ్గంపేటలో 100 పడకల ఆసుపత్రి, పెద్దాపురం ఆసుపత్రి విస్తరణ, తునిలో రైల్వే అండర్ బ్రిడ్జి, కాకినాడ పోర్టు కనెక్టివిటీ రోడ్లు, పిఠాపురం ఆర్‌ఓబీ, కిర్లంపూడిలో డిగ్రీ కళాశాల, పిఠాపురంలో బీసీ వెల్ఫేర్ వసతి పాఠశాల తదితర ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆనూరు-కొండపల్లి వద్ద పుష్కర కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో 1,500 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.అలాగే పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి భూసేకరణ, భవనాలకు నిధుల ప్రతిపాదనలు, ఖాళీ పోస్టుల భర్తీ, రహదారి భద్రత చర్యలకు సంబంధించిన నివేదికలను ఈ-ఆఫీస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన సందర్భంగా స్వీకరించిన ప్రజా అర్జీలను కూడా సమీక్షించిన కలెక్టర్.. క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో డాక్టర్ డి. తిప్పేనాయక్, ఆర్డీవో పి. కృష్ణమూర్తి, అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు
# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

**-ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు కిర్లంపూడి వీఆర్ఏలు వినతి.**



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,22**:తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ను కిర్లంపూడి వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు కాకాడ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు వి. ఆర్.ఏ లు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల అందరికీ తెలంగాణ తరహాలో పే స్కేలు తక్షణమే అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలు అందర్నీ వన్ టైం సెటిల్మెంట్ వి.ఆర్.ఓ గా నియమించాలని,అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్ కుమార్, దేవి, లక్ష్మి మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరం.



**-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,సెప్టెంబర్, 23:** అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు.

ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రత్తిపాడు,ఏలేశ్వరం మండలాలకు చెందిన పలు కుటుంబాలకు మొత్తం రూ. 8,10,478 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అందజేశారు.వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాను కల్పిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ఏలేశ్వరం మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,ఏలేశ్వరం మండల నాయకులు ధనేకుల వీరభద్రం,బొదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామి,సూతి బూరయ్య,పసల సూరిబాబు,బుద్ద సూర్యప్రకాష్,సూతి ప్రభాకర్,చింతలపాటి బుజ్జి రాజు,రుచి రమేష్,ప్రత్తిపాడు మండల నాయకులు మంతెన వెంకటరమణ,అడ్డాల త్రిమూర్తులు,సుంకర సోమరాజు,కొప్పన నాని,రామిశెట్టి మునసిబు,సత్యంశెట్టి సీతబాబు,యర్రాబత్తుల గోవింద నాయుడు,దాకారపు కృష్ణ,బొల్లు కొండబాబు,వెలుగుల నాని,పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శంఖవరం అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో 25నుండి 29వరుకు రిలే నిరాహార దీక్షలు.....





## శంఖవరం గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మించాలి అన్ని డిమాండ్....

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 23:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రమైన శంఖవరం గ్రామంలో

శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో శంఖవరం గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మాణం వేయాలనే డిమాండ్ తో 5 రోజులు రిలే నిరాహారదీక్ష చెయ్యాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం విలేకరు సమావేశంలో ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు గునపర్తి అపురూప్, ప్రధాన కార్యదర్శి పర్వత రామకృష్ణ మాట్లాడుతూ శంఖవరం గ్రామంలో ఆర్ అండ్ బి రహదారి పైన రవాణా చేస్తున్న లారీలు రవాణా ప్రధాన సమస్యగా

ఉన్నాది. ఇది దీర్ఘకాలిక సమస్య,లారీలు ఆపుజేయడం వల్లన శంఖవరం గ్రామం నందు శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుంది. కాబట్టి శంఖవరం గ్రామానికి బైపాస్ రోడ్డు ఒకటే మార్గమని అన్ని ఇప్పటికే కాకినాడ జిల్లా కలెక్టర్ ఈజీ ఆర్ ఎస్ లో కార్యక్రమం ఎన్నోసార్లు ఫిర్యాదు చేయడం జరిగింది.

**కాని సదరు ఫిర్యాదుపై కాని,బైపాసు రొడ్డుపైన కాని కాకినాడ**

జిల్లా కలెక్టరు ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం వల్లన ఈ నెల 25వ తేదీ నుండి శుక్రవారం ఉదయం 10-00 గంటల నుండి సాయంత్రం 04-00 గంటల వరకు అదే విధంగా 26,27,28,29వ తేదీ వరకు 5 రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేయడం ద్వారా శంఖవరం గ్రామం ప్రధాన సమస్య బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం స్పష్టమైన హామీ వచ్చే వరకు రిలే నిరాహారదీక్ష, చేయాలని గ్రామ అభివృద్ధి కమిటీ సేవా సంఘం శంఖవరం నిర్ణయించారు. కనుక యితర శాంతి యుత మార్గాల ద్వారా ఈ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా గునపర్తి అపురూప్, పర్వత రామకృష్ణ తెలియజేశారు.ఈ కార్యక్రమం అనంతరం శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు శంఖవరం గ్రామం నందులు గల ప్రధాన కూడలిలో షాపులకు, ప్రయాణికులకు, హోటల్స్ కు, పాన్ షాపులకు పాంప్లెట్లను పంచిపెట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు శంఖవరం అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు మేకల కృష్ణ, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరరావు,బోమ్మిడి చిట్టిబాబు,బోర్రా వీర వెంకట సత్యనారాయణ, పడాల చంటిబాబు, రేలంగి బాబురావు, మోకిరెడ్డి పెదకాపు,కొంగు రమేష్, బత్తిన తాతాజీ, పాలపర్తి నాగేశ్వరరావు,ఆకుల నాగేశ్వరరావు,ప్రగడ ప్రసాద్,షేక్ మదీనా తదితరులు3 పాల్గొన్నారు.

# వైభవంగా రమణయ్యపేట బాల వినాయకుడి నిమజ్జనం.

-ఏలేరు నది తీరంలో విగ్రహ నిమజ్జనం.

**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్, 23:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో దొడ్డి ముసలయ్య ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన బాల వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించిన అనంతరం బాల వినాయకుడిని గ్రామ పురవీధుల్లో తీన్మార్ డప్పులు,నృత్యాలు,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు.అనంతరం ఏలేరు నది తీరానికి చేరుకుని బాల వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బాల వినాయకుడి కృపాకటాక్షాలతో పాటు గ్రామ ప్రజల సహాయ సహకారాలతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దొడ్డి సత్తిబాబు,దొడ్డి శివాజీ, దొడ్డి శ్రీను, తుమ్మల సుబ్బు, కర్రి లోవబాబు, ఆళ్ల వెంకన్నబాబు, ఆడారి లోవబాబు, దాడి రమణబాబు, దాడి ప్రకాష్, దొడ్డి శివ, దొడ్డి ఏసుబాబు, మద్దాల శివ,రాపేటి రమేష్, దొడ్డి స్వామి, చిట్టినీడి ఏసుబాబు, సింగులూరి రాజు, సింగులూరి చిన్ని, ఈగల నాగేశ్వరరావు, ఇసరపు రాంబాబు, ఆడారి కార్తీక్, పెంటకోట సాయి, కర్రి వరబాబు, దొడ్డి పవన్, తుమ్మల శ్రీ చైతన్య అభిలాష్, దొడ్డి యస్వంత్‌తో పాటు బాల వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటానికి రైతుల పాలాభిషేకం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** జగ్గంపేట మండలం గుర్రంపాలెం, గొల్లలగుంట గ్రామాల రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో సూపర్ ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండటంతో పంటలు పండించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంటనే స్పందించి, రూ. 3 కోట్ల 80 లక్షలతో సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే జ్యోతుల పాపారావు సాగునీటి పథకం – మామిడాడ కార్యక్రమాన్ని చేపట్టి శరవేగంగా పనులు పూర్తి చేయించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కాలువల ద్వారా నీటిని తీసుకువచ్చి చెరువుల్లో నింపి రైతులకు, పశుపక్షాదులకు నీళ్ల అందించిన భగీరథుడు అని అన్నారు. ముఖ్యంగా గొల్లలగుంట దొర చెరువులో ఈ సంవత్సరం వర్షపాతం లేకపోవడంతో పశువులు తాగడానికి కూడా నీరు లేని పరిస్థితి నెలకొందని, ఎమ్మెల్యే చొరవతో నీటిని విడుదల చేయడం వల్ల చెరువు నిండటంతో తమకు ఊరట లభించిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అందుకే కృతజ్ఞతగా చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొర చెరువు కమిటీ రైతులు పోంద్రు బాలనాగు, చిత్రపు బాబు, ములికి శివకుమార్, రాయుడు వీరబాబు, చింతాకుల ఈశ్వరరావు, గండికోట నాగరాజు, గొల్లవిల్లి రాంబాబు, కొప్పిశెట్టి సూరిబాబు, కలిదండి రాజశేఖర్, చింతాడ రాజు, తలారి వెంకటరమణ, ధనికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జోరువానలోనూ ఘనంగా కముజువారిపాలెం వినాయక నిమజ్జనం



డీజే సౌండ్‌తో యువత సందడి..



**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 23:** కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని కముజువారిపాలెంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఏకాహ భజన, ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం టెంకాయలు కొట్టి, భారీ బాణసంచా కాల్చుతూ, పుష్పాలను వెదజల్లుతూ భక్తులు గణనాథుడిపై తమ భక్తిని చాటుకున్నారు.

ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. డీజే సౌండ్ హోరుతో యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా, కుర్రకారు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చిందులు వేయడం అందరినీ ఆకట్టుకుంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగులు పూసుకుంటూ, భజనలు, భక్తిగీతాలు ఆలపిస్తూ వీధివీధినా ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. బుధవారం జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ ఉత్సవాల సందడి ఏమాత్రం తగ్గలేదు. స్వామివారిపై వర్షం పడకుండా గొడుగును నీడగా ఏర్పాటు చేసి భక్తులు నిమజ్జన యాత్రను కొనసాగించారు. అనంతరం అమలాపురం--బొబ్బర్లంక ప్రధాన పంట కాలువ వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. జ్యోతిని వెలిగించి అరటితెప్పలో ఉంచి కాలువలో వదిలే సంప్రదాయ కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.కోనసీమ గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన పంట కాలువల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం. భక్తి, గ్రామీణ ఐక్యత, ఉత్సాహంతో కూడిన ఈ ఆచారం కముజువారిపాలెంలో మరోసారి ఘనంగా ఆవిష్కృతమైంది.

## శ్రీ బాలగణపతి స్వామివారి ఆభరణములకు

# 282 గ్రా. వెండి బహుకరణ



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 23:**స్థానిక పశు వుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న సత్యసాయినగర్ లో వేంచేసియున్న శ్రీ బాలగణపతి స్వామివారి మందిరం నందు గణపతి నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని సత్య నగర్ కు చెందిన కీ.శే. కొల్లూరి వీరేశ్వరరావు, భ్రమరాంబ దంపతుల జ్ఞాపకార్ధం వారి కుమారుడు దివాకర సత్యనారాయణ మూర్తి, కామేశ్వరి భ్రమరాంబ దంపతులు స్వామివారికి వెండి ఆభరణముల నిమిత్తం 282 గ్రాములు బహుకరించారు. ఈ ఈ సందర్భంగా దాతలను సత్యసాయినగర్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## జగ్గంపేటలో వైభవంగా విష్ణు సహస్రనామ నక్షత్రమాల పారాయణం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 23 :** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం 8 గంటల నుండి విష్ణు సహస్రనామ పారాయణం నక్షత్రమాల – 27 కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో 300 మంది మహిళలచే 27 సార్లు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. మొదలుపెట్టిన 300 మంది మహిళలు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చివరి వరకు 27 సార్లు పూర్తిగా పారాయణంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా జగ్గంపేటసీఐ తిరుపతిరావు, తహసీల్దార్ జేవియర్ రమేష్, ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. వేద పండితులు, బ్రాహ్మణుల వేద మంత్రోచ్చారణ మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మానేపల్లి బంగార్రాజు, కంచర్ల బాబు, వి నాగసత్య, బొండా వీర సత్య, బోండా నూకబాబు, దారా శ్రీనివాస్, మానేపల్లి వీర్రాజు గుప్తా, మహిళా సంఘం సభ్యులు కొత్త మాధురి రత్న ఆండాళ్, బోండా విజయ, మతంశెట్టి లావణ్య,మానేపల్లి రజిని,స్వాతి, ఇందిరా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ఏలేశ్వరం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలో 30 గణేష్ మండపాలలో తొమ్మిది రోజులపాటు రూప వేప నైవేద్యాలతో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో పూజలు అందుకున్న గణనాథులు ఉదయం నుంచి నిమజ్జనానికి ఏలేరు ప్రధాన కాల వద్దకు క్యూ కట్టాయి. పల్లెల్లో, పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తూ గణేష్ మండపాల నిర్వహణ కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బాణాసంచా కాలుస్తూ, తీన్మార్ డప్పులతో, డీజే శబ్దాలకు అనుగుణంగా యువతీ యువకులు చేసిన డాన్సులు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ఉదయం 10 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు గణనాథుల ఊరేగింపుతో పట్టణం వీధులు పండగ వాతావరణంతో భక్తుల సందడితో కిటకిటలాడాయి. మండలంలో పెద్దనాపల్లి, యర్రవరం, లింగంపర్తి, సిరిపురం, పేరవరం, భద్రవరం, జె అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, సి రాయవరం తదితర గ్రామాల్లో నెలకొల్పిన గణనాథులను ఊరేగింపుగా నిమజ్జనోత్సవానికి భక్తులు తరలించారు. ఏలేశ్వరం పోలీస్ ల పహారా లో గణేష్ నిమజ్జన రేవుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తిమ్మరాజు చెరువు వద్ద, ఏలేశ్వరం శివాలయం బ్రాహ్మణ రేపు వద్ద, తిరుమాలి, యర్రవరం ఏలేరు ప్రధాన కాలువ వద్ద , పెద్దనాపల్లిలో ఏలేరు కాలువలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రత్యేకమైన రేవులు ఏర్పాటు చేశారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం.

-జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 23:** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో దోహదపడతాయని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం, రామచంద్రపురం గ్రామంలో తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో యువసేన యూత్ నిర్వహించిన జిల్లాస్థాయి నైట్ వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరిగింది.ఫైనల్ మ్యాచ్‌లో ఏలేశ్వరం యేసు టీం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.15,000 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలను తుమ్మలపల్లి రమేష్ తన సొంత నిధులతో అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన దివాన్‌చెరువు టీంకు రూ.10,000 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను కూడా తుమ్మలపల్లి రమేష్ తన సొంత నిధులతో అందజేశారు.యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తుమ్మలపల్లి రమేష్ ఈ టోర్నమెంట్‌కు తన సొంత నిధులతో ప్రైజ్ మనీ, ట్రోఫీలను అందించడం పట్ల క్రీడాకారులు, యువత హర్షం వ్యక్తం చేశారు.

## బాల వినాయకుని నిమజ్జన కార్యక్రమం..



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 23;** బుధవారం అడ్డతీగల శ్రీ సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా,బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని నిమజ్జనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను కూడా లెక్కచేయకుండా,
బాలవినాయకునీ నిమజ్జన కార్యక్రమంలో యువత, గ్రామస్తులు పాల్గొని బాల వినాయకునికి వీడ్కోలు పలికారు. అనంతరం మేళం తాళాల తో నిమజ్జనా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో చిత్రలేఖనం కార్యక్రమం..



**అడ్డతీగల,పెన్ పవర్, సెప్టెంబర్ 23;** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని 25 సంవత్సరాల సేవా సంకల్ప అభియాన్ – – వికసిత్ భారత్ మన సంకల్పం కార్యక్రమంలో భాగంగా “25 కోట్ల భారతీయుల కలలు” అనే అంశంపై చిత్రలేఖనం కార్యక్రమాన్ని బుధవారం అడ్డతీగల ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి హాజరై విద్యార్థినులతో చిత్రలేఖనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి గల ఉద్దేశ్యం, వికసిత్ భారత్ నిర్మాణంలో యువత మరియు విద్యార్థిని విద్యార్థుల పాత్ర గురించి విద్యార్థినులకు వివరించారు.
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుడికి. ఆదిలక్ష్మి , బీర. వెంకటలక్ష్మి , దుంపల. పండు బాబు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులకు ఘన సత్కారం



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీవిరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల, డిప్యూటీ ఎంపీడీవో అమ్మిరాజు ఆధ్వర్యంలో పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందించారు. ప్రజలకు సేవలందించడంలో వారు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు.

మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తమ పదవీకాలంలో అధికారులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరస్పరం అభినందనలు తెలియజేసుకుంటూ కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో ముగించారు.

## అక్టోబరు 2, 3, 4తేదీల్లో క్రెడాయ్ హోమ్ ఎక్స్ పో




- ఒకే వేదికలో 120 స్టాల్స్ లో సమగ్ర సమాచారం
- నిర్మాణ రంగ అభివృద్ధికి నిబంధనలు సరళీకరించిన ప్రభుత్వం
- మీడియా సమావేశంలో క్రెడాయ్ ప్రతినిధులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**రియల్ ఎస్టేట్ రంగంలో స్థలం కొనుగోలు నుంచి భవన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు వినియోగ దారులకు అవసరమైన సమగ్ర వివరాలతో అక్టోబరు 2,3 ,4 తేదీల్లో జె ఎన్ రోడ్డులోని చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వేషన్ సెంటర్ లో మూడు రోజులపాటు హోమ్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, నగర చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ మన్యం సంతోష్ ఫణి కుమార్, జనరల్ సెక్రటరీ చల్లా బాల మురళికృష్ణ, జాతీయ ఎన్విరాన్ మెంట్ కమిటీ మెంబర్ కర్రి శేఖర్ రెడ్డి బుధవారం మీడియా సమావేశం లో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకోసారి హోం ఎక్స్ పో నిర్వహిస్థామని, గతంలో నిర్వహించిన ఐదు హోం ఎక్స్ పో లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈసారి 120 స్టాల్స్ పైగా భారీ ఎక్స్ పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్స్ పో లో పలు రకాల కంపెనీల బ్రాండ్ల కు చెందిన అధునాతన, సాంకేతిక గృహ ఉపకరణాలు , మెటీరియల్స్ ప్రదర్శనకు ఉంటాయన్నారు. అంటే లేఅవుట్ వెంచర్స్, బిల్డర్స్, ఆర్కిటెక్ట్స్, డిజయినర్స్, సివిల్ ఇంజినీర్స్ సేవలు అన్ని ఒకే వేదిక పై అందుబాటులో ఉండడం వలన వినియోగ దారులకు వెసులుబాటు, సమయం కూడా లభిస్తుంద న్నారు. గంటగంటకు లక్కీ డీప్ నిర్వహిస్తామని తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఎక్స్ పో ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. నగర ప్రజలు ఈ ఎక్స్ పో సందర్శించి విజయవంతం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేసారు. భవన నిర్మాణ రంగం గురించి బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టిందన్నారు. క్రెడాయ్ సూచనలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలు సరళతరం చేస్తూ జీవోలు కూడా ప్రభుత్వం జారీ చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, పి. నారాయణలకు, ఇతర మంత్రులకు, ప్రజాప్రతి నిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రె.రా చట్టం రాకముందే క్రెడాయ్ కొన్ని నిబంధనలు ఏర్పాటు చేసుకుని అమలు చేస్తోందని ఆయన గుర్తుచేసారు. ఖాతాదారులకు ఇచ్చిన హామీ ప్రకారం నిర్మాణలు పూర్తిచేసి అప్పగిస్తున్నామన్నారు. లోపాలు జరిగితే సామరస్యంగా సెటిల్ చేస్తున్న మన్నారు. రెరా చట్ట నిబంధనలు పాటించే క్రెడాయ్ సభ్యులకు విశ్వసనీయత ఉందన్నారు. ప్రభుత్వం నగర పరిసర ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, మాస్టర్ ప్లాన్ అమలు చేయడం వల్ల గృహ నిర్మాణాలు వేగవంతం అవుతాయని, ఖర్చు తగ్గుతుందని, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని బుడ్డిగ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. స్థలం కొనుగోలుకు వీలుగా ధరలు ఉన్నప్పుడు భవన నిర్మాణాలు పెరుగుతాయ న్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం చేయడం వల్ల నిధులు లభ్యత పెరిగి నగర శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సమావేశంలో క్రెడాయ్ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కోశాధికారి టివిఎల్ నరసింహారావు, కార్యవర్గ సభ్యులు యెజ్జు శ్రీనివాస కిరణ్, బళ్లా వర ప్రసాద్, రుత్తల అనిల్, కోన మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## సాయి దుర్గానగర్ లో అక్రమ నిర్మాణం కూల్చివేత




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**నగరంలో అనధికార నిర్మాణాలపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. స్థానిక సాయిదుర్గానగర్లో నగరపాలక సంస్థ నుండి అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని నగర ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. నిర్దేశిత అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా తొలగించు కోకుంటే నగరపాలక సిబ్బందే పూర్తిగా తొలగిస్తారని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఇకపైనా అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్ తొలగింపు కొనసాగుతుందని.. అవసరమైతే అదనపు జేసిబీలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని సిటీ ప్లానర్ ను ఆదేశించడం జరిగిందన్నారు. వార్డు సచివాలయాల వారీగా అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్ లను ఇప్పటికే గుర్తించామని, వాటన్నింటినీ షెడ్యూల్ ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల సమయంలో తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని అనుమతులు పొంది, నగర ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి సహకరించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టింబర్ యార్డు రోడ్డులో రహదారి పైకి వచ్చిన ర్యాంపులు, ప్లాట్ ఫామ్ లను పట్టణ ప్రణాళిక విభాగం తొలగించడం జరిగింది.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం?

**పరిష్కార గడువు వరకు వేచి.. సమస్య తీరకుండానే పరిష్కరించినట్లు సంతకాలు తీసుకుంటున్నారంటూ ఆరోపణలు**




**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)పై తాళ్లపూడి మండలంలో కొన్ని వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ.. కొన్ని శాఖల్లో మాత్రం ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఫిర్యాదిదారులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పరిష్కారానికి నిర్దేశించిన చివరి తేదీ వరకు వేచి చూస్తున్నారని పలువురు వాపోతున్నారు. గడువు సమీపించిన సమయంలో ఫిర్యాదుదారులను సంప్రదించి, సమస్యపై ఏదో ఒక సమాధానం చెప్పి, సమస్య వాస్తవంగా పరిష్కారం కాకపోయినా పరిష్కరించినట్లు సంతకాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రాజకీయ ఒత్తిళ్లపై కూడా ఆరోపణలు......**

మరికొందరు ఫిర్యాదిదారులు మరో అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల సూచనలు, ఒత్తిళ్లకు కొందరు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. దీంతో పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం స్వతంత్రంగా పరిశీలించి పరిష్కరించాల్సిన వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో పీజీఆర్ఎస్ వ్యవస్థను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదు పరిష్కారమైనట్లు నమోదు చేస్తే, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఉద్దేశమే దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి....**

పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న అనంతరం మాత్రమే పరిష్కారంగా నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదులను ముగించినట్లు చూపుతున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలన చేపట్టి, అవసరమైతే ఫిర్యాదిదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు న్యాయం అందేలా పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించాలని కోరుతున్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను కోరిన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ ఫయాజ్ బాషా కోరారు. ఇటీవల జరిగిన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫయాజ్ బాషా తన ఎన్నికకు సంబంధించిన విషయాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని కోరారు. ఈ మర్యాదపూర్వక భేటీలో రంపచోడవరం తహసీల్దార్ సి. హెచ్. బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్లు వెంకటేష్, వి. రవీంద్రబాబు, సునీత, మహా లక్ష్మణరావు, జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఉద్యోగులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సి. హెచ్. నిర్మలకుమారి, సీనియర్ సంపాదకులు కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరం దేవి చౌక్ లో కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాల ముహూర్తం రాట.



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 22 :-**గోకవరం మండల కేంద్రం దేవి చౌక్ లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాల వేడుక ముహూర్తాన్ని కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు వేదమంత్రాలు పఠించగా, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దసరా మహోత్సవాల నిర్వహణకు శుభ ముహూర్తంగా భావించి రాట వేసి సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈరోజు నుంచి అమ్మవారి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎన్నో మహిమలు కలిగిన కనకదుర్గ అమ్మవారి ఉత్సవాల్లో భాగస్వాములు అవుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉన్నామని రథ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అమ్మవారి దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరూ విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నాగదేవి ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** వినాయక చవితి మహోత్స వాలను పురస్కరించుకొని నాగదేవి ఆటో రిక్షా ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ , నన్నయ మండపం శ్రీ విజయలక్ష్మి గణపతి ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు పోతుల నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి మహోత్సవాలను స్థానిక డాక్టర్ తెలుగుదేశం నాయకులు యాళ్ళ ప్రదీప్ సుకుమార్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తు న్నామన్నారు. ఉపాధ్యక్షుడు వీశంశెట్టి లక్ష్మీ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ, ఈసారి 21వ సంవత్సర మహోత్సవాల్లో నాలుగు వేల మందికి భక్తులకు అన్నదానం చేశామని, ఉత్సవాలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాడ శ్రీను, కొల్లి నాగరాజు, భూల లక్ష్మణరావు, దుర్గారావు వి దుర్గారావు, వనము సూరిబాబు నాగులపల్లి గణేష్ చందక శివ, రామోజీ ప్రసాదు, బత్తల శ్రీనివాసు, పిల్లి సత్యనారాయణ, పిల్లి శ్రీను, చెక్కల వీరబాబు, చెరుకూరి బంగారయ్య, ఒనుముల దుర్గాప్రసాద్ బాషా గోపికృష్ణ కొండలరావు, అనసూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

## తుఫాన్ హెచ్చరికలతో అప్రమత్తమైన స్వర్ణ గ్రామ సిబ్బంది



**వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 23 :** తుఫాన్ హెచ్చరికతో మండలంలో ఉన్న పెద్దేరు వద్ద స్వర్ణ గ్రామ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. బుధవారం ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తుపాన్ హెచ్చరికతో రెండు మండలాల సరిహద్దులో ఉన్న పెద్దేరు కు వరద వస్తుండడంతో స్వర్ణ గ్రామ సిబ్బంది అప్రమత్తమై ఎవరిని అటువైపు వెళ్ళకుండా నిరోధించారని తెలిపారు. ఈరోజు పెద్దేరులో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు వర్షం లో తడుస్తూ నిమజ్జనం చేయడం విశేషం. నిమజ్జన కార్యక్రమాన్ని స్వర్ణ గ్రామ సిబ్బంది పోలీసులు దగ్గర ఉండి ఏ విధమైన ఇబ్బందులు కలవకుండా జాగ్రత్త వహించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com